సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



కార్యమేదైనా.. డోలు మోతే!
మంచీ, చెడు.. ఇలా ఆదివాసీల కుటుంబాల్లో జరిగే ఏ కార్యక్రమమైనా డోలు మోత విడదీయలేని బంధంగా మారిపోయింది. 8లో



రైతాంగాన్ని ఆదుకోవాలి
ఇటీవల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°
వాతావరణం
జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

కళ.. ఆకట్టుకునేలా...

చెక్కతో చేసిన గణపతి బొమ్మకు తుదిరూపు ఇస్తున్న కళాకారుడు



- అబ్బురపరుస్తున్న ఆదివాసీ కళాకారులు
- కొండపల్లిని మించి ఆకట్టుకునేలా కొయ్యబొమ్మల తయారీ
- కాస్త చేయూతనిస్తే సత్తా చాటడం ఖాయం
- విక్రయ కేంద్రాలు ఏర్పాటు, నిరంతర శిక్షణతో మరింత ఊపు

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



ఆదివాసీ కళాకారులు రూపొందించిన కొయ్య బొమ్మలు

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. ఇతరులతో కలిసేందుకు పెద్దగా ఇష్టపడని ఆదివాసీలు తమ కట్టుబాట్లతో ప్రత్యేకంగా నిలుస్తారు. తరాలు మారుతున్న నేపథ్యాన వారు సైతం స్వతహాగా తమలో ఉన్న కళలకు పదును పెడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వీరి జీవనశైలినే బొమ్మల రూపంలో తీర్చిదిద్ది ప్రతిఒక్కరూ అబ్బురపడేలా చేస్తున్నారు. అలా ఆదివాసీల కొయ్య బొమ్మలు భద్రాచలం ఐటీడీఏలో కొలువు దీరాయి. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఈ అంశంపై కథనం. – భద్రాచలం

ఐటీడీఏలో వర్క్‌షాప్

ఆదివాసీ, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి అందించాలనే లక్ష్యంతో భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియం ఏర్పాటుచేశారు. ఇందులో గిరిజన, ఆదివాసీలు వాడిన వస్తువులు మొదలు వేషధారణ, ఇంటి, పొలం సామాగ్రితో పాటు బుర్రలు, కొమ్ములు వంటి అన్ని రకాల వస్తువులను ఉంచారు. ఇంతటితో సరిపెట్టకుండా ఆదివాసీల జీవన విధానం, కట్టుబాట్లను బొమ్మల రూపంలో అందుబాటులోకి తీసుకొస్తే మరింత ప్రాచుర్యం దక్కడమే కాక నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందనే భావనతో మ్యూజియం పక్కనే కొయ్య బొమ్మల వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఇందులో ఆదివాసీ కళాకారులు చెక్కతో బొమ్మలను అందంగా చెక్కుతున్నారు. వీటిని భద్రాచలం ఐటీడీఏ, శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి వచ్చిన అతిథులుగా జ్ఞాపికలుగా ఇస్తుండడంతో కళారూపాలు రాష్ట్రం, దేశం దాటుతున్నాయి.

ఆదరిస్తే... అంతర్జాతీయ స్థాయికే

ఆదివాసీలు కొయ్య బొమ్మలు రూపొందిస్తున్న విషయానికి మరింత ప్రాచుర్యం కల్పిస్తే ఆదరణ లభించే అవకాశముంది. కొండపల్లి, నిర్మల్ కొయ్య బొమ్మల మాదిరిగానే ఇవి ఉన్నప్పటికీ భిన్నమైన సంస్కృతిని ప్రతిబింబిస్తుండడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఇద్దరు ఆదివాసీ కళాకారులు వీటిని రూపొందిస్తుండగా.. మరికొందరు శిక్షణ పొందుతున్నారు. డిమాండ్, ఆర్డర్ల ఆధారంగా వీటిని తయారు చేస్తున్న కళాకారులు.. ఎగ్జిబిషన్లు, ఇతర కళాజాతరల సమయాన మంచి ఆదరణ లభిస్తోందని చెబుతున్నారు.

విక్రయిస్తే బాగు...

ప్రస్తుతం కొయ్య బొమ్మలకు సంబంధించి ఐటీడీఏలో తప్ప మరెక్కడా విక్రయ కేంద్రాలు లేవు. భద్రాచలానికి భక్తులతో పాటు పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. వీరందరికి బొమ్మలను అందుబాటులోకి తీసుకొచ్చేలా రామాలయం వెళ్లే దారి, ఆలయం సమీపాన కూడా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆదరణ పెరిగే అవకాశముంది. అంతేకాక రామాలయానికి వచ్చేవారికి ఐటీడీఏలో మ్యూజియం ఉందనే విషయం తెలిసేలా ప్రచారం చేయడమే కాక రవాణా సౌకర్యం కల్పిస్తే అందరూ వెళ్లి చూడడంతో కాక ఆసక్తి ఉన్నవారు బొమ్మలు కొనుగోలు చేస్తారు. తద్వారా ఆదివాసీలకు ఉపాధి లభించడమే కాక కళకు మరింత ప్రాచుర్యం దక్కుతుంది. ఇక కొయ్యబొమ్మల తయారీపై ఆదివాసీ యువతకు వర్క్‌షాప్‌లు, వైటీసీలో కోర్సులు మొదలుపెట్టాలనే సూచనలు కూడా వస్తున్నాయి.

పీఓ రాహుల్ ప్రత్యేక దృష్టి

ఐటీడీఏ పీఓగా కొన్నాళ్ల క్రితం బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మ్యూజియంతో పాటుగా కొయ్య బొమ్మల తయారీపై దృష్టి సారించారు. ఇప్పటికి పలుమార్లు కేంద్రాన్ని సందర్శించి కళానైపుణ్యాన్ని అభినందించారు. అలాగే, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ ద్వారా మేళా ఏర్పాటు చేయించారు. వీటికి తోడు విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేయించి ఆదివాసీ యువతకు శిక్షణ ఇప్పించాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరుతున్నారు.



కొయ్య బొమ్మలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్ (ఫైల్)

న్యూస్‌రీల్

నయనానందకరం... నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి నిత్యకల్యాణం గురువారం నయనానందకరంగా సాగింది. తొలుత గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. ఆతర్వాత బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

దిగుబడి తగ్గడంపై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త బీఎస్‌రావు

అశ్వారావుపేటరూరల్: వాతావరణంలో వచ్చిన మార్పులతోనే ఈ ఏడాది ఆయిల్‌పాం తోటల్లో గెలల దిగుబడి తగ్గిందని.. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందొద్దని ప్రముఖ శాస్త్రవేత్త బీఎస్.రావు సూచించారు. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపాన ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో గురువారం రైతులకు ఆయిల్‌పామ్ సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బీఎస్.రావు మాట్లాడుతూ గెలల దిగుబడి తగ్గడంపై రైతుల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యాన తాము పరిశోధన చేశామని చెప్పారు. వాతావరణంలో మార్పులే ఇందుకు కారణంగా తేలిందని తెలిపారు. కాగా, సాగుదారులు యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సకాలంలో ఎరువులు వేసుకోవాలని సూచించారు. అయితే, కొందరు రైతులు ఆయిల్‌పామ్ సబ్సిడీపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని నిలదీశారు. అనంతరం రైతుల తోటలను సందర్శించి సూచనలు, సలహాలు ఇచ్చారు. డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ, డివిజనల్ అధికారులు ఆకుల బాలకృష్ణ, రాజశేఖరరెడ్డి, రైతులు మొగళ్లపు చెన్నకేశవరావు, కొక్కెరపాటి పుల్లయ్య, అంకత ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగి.. తగ్గిన గోదావరి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం క్రమంగా పెరిగినా మళ్లీ తగ్గింది. బుధవారం సాయంత్రం 34అడుగులుగా ఉన్న గోదావరి గురువారం ఉదయం 38 అడుగుల చేరింది. ఆపై సాయంత్రం వరకు నిలకడగా కొనసాగినా ఆతర్వాత తగ్గుతూ రాత్రి 36 అడుగులకు పడిపోయింది. అయితే, ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యాన వరద ప్రవాహం పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

మహిళాశక్తి క్యాంటీన్లు!

- జిల్లాలో ఐదు చోట్ల ఏర్పాటుకు నిర్ణయం
- నిర్వహణ బాధ్యతలు స్వయం సంఘాల సభ్యులకు..
- కలెక్టరేట్‌లో క్యాంటీన్‌ను నేడు ప్రారంభించనున్న మంత్రి పొంగులేటి



కలెక్టరేట్‌లో సిద్ధమైన మహిళా శక్తి క్యాంటీన్

చుంచుపల్లి: రాష్ట్రప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ, విద్యార్థుల యూనిఫామ్ కుట్టే బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత గ్రామాల్లో మీ–సేవ కేంద్రాలను సైతం మహిళల పేరిట ఏర్పాటుకు నిర్ణయించింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు సిద్ధమైంది. తొలి దశలో జిల్లాకు ఐదు చోట్ల క్యాంటీన్లు మంజూరు చేయగా, స్థలాల ఖరారు బాధ్యతలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించారు. మొదటగా కలెక్టరేట్ సముదాయంలో అందుబాటులోకి రానున్న క్యాంటీన్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు.

రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు

స్వయం సహాయక సంఘాలకు వివిధ ప్రోత్సాహకాలు అందిస్తుండగా వారి ఆధ్వర్యంలోనే ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మెరుగైన ప్రగతి, ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండడంతో పాటు వ్యాపార నిర్వహణ సామర్థ్యమే కాక వంటకాల తయారీలో అనుభవమున్న మహిళా సంఘాలను ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గుర్తించారు. జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో క్యాంటీన్లు ఏర్పాటుచేస్తారు. జిల్లాలోని భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి(కొత్తగూడెం), కలెక్టరేట్‌లో క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్ణయించగా కలెక్టరేట్, మణుగూరులో ప్రారంభానికి రంగం సిద్ధమైంది. క్యాంటీన్ల నిర్వహణ బాధ్యత వంద శాతం స్వయం సహాయక సంఘాల సభ్యులే నిర్వర్తించాల్సి ఉంటుంది. అవకాశం ఉంటే క్యాంటీన్లలో లేదంటే ఇళ్ల వద్ద ఆహార పదార్థాలు తయారు చేసి తీసుకొస్తారు. అంతేకాకుండా ఆర్డర్లపై పిండి వంటలు, మిఠాయిలు, పచ్చళ్లు కూడా తయారుచేస్తారు. శుభకార్యాలకు అవసరమైన వారు ముందస్తుగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కాగా, క్యాంటీన్ల ఏర్పాటుకు స్త్రీనిధి పథకం కింద రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు నాలుగు శ్లాబ్‌ల్లో రుణాలను సైతం ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

త్వరలోనే అందుబాటులోకి..



స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయిస్తోంది. జిల్లాలో ఐదు క్యాంటీన్ల ఏర్పాటుకు అవకాశం ఇవ్వగా.. తొలుత కలెక్టరేట్‌లో సిద్ధమైన క్యాంటీన్‌ను మంత్రి పొంగులేటి శుక్రవారం ప్రారంభించనున్నారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించాం.
– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

ప్రతీ ఇంట ఇంకుడు గుంత తప్పనిసరి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



విద్యానగర్ జీపీ కార్యాలయంలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

చుంచుపల్లి/సుజాతనగర్: ప్రతీ ఒక్కరూ ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకుని వర్షపు నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భ జలాల అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. చుంచుపల్లి మండలంలోని విద్యానగర్‌కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల వద్ద వీటిని నిర్మించడం ద్వారా నీటి ఎద్దడి ఏర్పడదని తెలిపారు. భూగర్భ జలాలను పెంపొందించడం అందరి బాధ్యత అని చెప్పారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో పనస మొక్క నాటారు. ఆతర్వాత సుజాతనగర్ మండలం సర్వారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా ఆరోగ్య సమితి సమావేశంలో కలెక్టర్ పాటిల్ మాట్లాడారు. ప్రతీ రైతు వారి పంట పొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేస్తే భూగర్భజలాలను పెంచుకోవచ్చని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో నీటి కుంటల ఏర్పాటుకు అవకాశముందని చెప్పారు. అలాగే, రైతులు సంప్రదాయ పంటలతో పాటు మునగ వంటివి సాగు చేస్తే ఏడాది పొడవునా దిగుబడి వస్తుందని తెలిపారు. కాగా, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం మహిళాశక్తి పథకంలో భాగంగా కూరగాయల పెంపకం, అమ్మకం, బేకరీ, బ్యూటీ పార్లర్, కర్రీ పాయింట్లు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, తహసీల్దార్లు పానెం కృష్ణ, శిరీష ఎంపీడీఓలు వి.అశోక్ కుమార్, భారతి, సుజాతనగర్ మండల ప్రత్యేకాధికారి త్రినాథ్‌బాబుతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు సత్యనారాయణ, పి.నాగరాజు, సంజీవరెడ్డి, మీరాంబి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి గురువారం సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపించారు. వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

క్యా ఖూబ్ లగ్తీ హో..!

- పాట పాడి పోటీలను ప్రారంభించిన జిల్లా జడ్జి



సమావేశంలో పాట పాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులకు గురువారం క్రీడా, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహించారు. తొలుత లైబ్రరీహాల్‌లో న్యాయవాదులకు ఆటలు, పాటల పోటీలు ఏర్పాటుచేయగా.. జిల్లా జడ్జి పాటిల్ వసంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హిందీ సినిమా ధర్మాత్మలో ముఖేష్, కాంచన్ ఆలపించిన 'క్యా ఖూబ్ లగ్తీ హో.. బడీ సుందర్ దిఖ్తీ హో' అనే పాటను ఆలపించడంతో అందరూ చప్పట్లతో ఉత్సాహపరిచారు. ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ కోర్టుల జడ్జిలు గొల్లపూడి భానుమతి, సుచరిత, సాయిశ్రీ, వి.శివనాయక్, బార్ అసోసియోషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాది ఉపేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'నైనీ'పై ఒడిశా సర్కార్‌తో చర్చలు

- పది రోజుల్లో చెట్ల తొలగింపు మొదలు
- సింగరేణికి హామీ ఇచ్చిన ఒడిశా సర్కార్



ఒడిశా సీఎస్ మనోజ్ అహూజాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి సింగరేణి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా చెట్ల గణన, తొలగింపు ప్రక్రియను మరో పది రోజుల్లో ప్రారంభిస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా హామీ ఇచ్చారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన కొత్త బొగ్గు బ్లాక్‌ల స్థితిగతులపై ఒడిశాలోని భువనేశ్వర్‌లో బుధవారం సమావేశం జరిగింది. ఈ భేటీకి సింగరేణి సీఎండీ బలరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నైనీ బ్లాక్ అంశంపై ఒడిశా ప్రభుత్వ అధికారులతో చర్చ జరిగింది. సింగరేణికి బదలాయించిన 783 ఎకరాల్లో చెట్లను తొలగిస్తే తాము బొగ్గు ఉత్పతికి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఎండీ బలరామ్ వెల్లడించంతో వారు సానుకూలంగా స్పందించారు.

పొడిగింపు

సింగరేణి కాలరీస్ సామాజిక బాధ్యతతో చేపట్టిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం గడువు ఈనెల 12 వరకు పొడిగించినట్లు సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువత సివిల్స్ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తే సింగరేణి తరపున రూ.లక్ష ఆర్థిక సాయం అందించేలా రాజీవ్ గాంధీ సివిల్ అభయ హస్తం పథకాన్ని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రారంభించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 6న ముగియగా.. 12వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అర్హులైన అభ్యర్థులు సింగరేణి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సీఎండీ సూచించారు.

'స్వచ్ఛదనం - పచ్చదనం' ఎలా సాగుతోంది?

జిల్లాలో పర్యటించిన ప్రత్యేకాధికారి గౌతమ్



రుద్రంపూర్‌లో ఔషధ మొక్కలను పరిశీలిస్తున్న గౌతమ్, కలెక్టర్ పాటిల్

చుంచుపల్లి: జిల్లాలో 'స్వచ్ఛదనం – పచ్చదనం' నిర్వహణ తీరును జిల్లా ప్రత్యేకాధికారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీ.పీ.గౌతమ్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కొత్తగూడెం మున్సిపాలిటీ, చుంచుపల్లి మండలాల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి పర్యటించిన ఆయన విద్యానగర్ గ్రామపంచాయతీలో ఇంకుడు గుంతల నిర్మాణంపై ఆరా తీశారు. ఆతర్వాత రుద్రంపూర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కలు, స్కూల్ గార్డెన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కొత్తగూడెంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన గౌతమ్ 27వ వార్డులోని ప్రగతి మైదానంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, డీపీఓ వి.చంద్రమౌళి, జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, డీఎల్‌పీఓ రమణరావు, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సంజీవరెడ్డి, సత్యనారాయణ, నరేందర్, నాని, రమేష్ పాల్గొన్నారు.

వాన నీటిని వృథా చేయొద్దు..



నీటిశుద్ధికేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్/చుంచుపల్లి: వాన రూపంలో పడే నీరు వృథా కాకుండా ప్రతీ చుక్కను ఒడిసిపట్టుకోవాలని.. భూమిలో ఇంకేలా జాగ్రత్త వహిస్తే భవిష్యత్ తరాలకు నీటి కొరత రాదని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి ఆసిఫ్ ఇస్మాయిల్ తెలిపారు. పాల్వంచ మండలం మండలం తోగ్గూడెంలోని మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాన్ని గురువారం ఆయన రాష్ట్ర జలశక్తి అభియాన్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ మిట్టల్, డీఆర్డీఓ విద్యాచందనతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా నీటి శుద్ధికి తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాన నీరు వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవాలని.. అదనపు నీరు భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు నిర్మిస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. అలాగే, చుంచుపల్లి మండలం త్రీ ఇంక్లైన్, రుద్రంపూర్‌ల్లో పర్యటించిన అధికారులు బృహత్ పల్లె ప్రకృతి వనం, కేవీకే, రుద్రంపూర్ జెడ్పీహెచ్‌ఎస్, విద్యానగర్ జీపీలో మొక్కలు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. మిషన్ భగీరథ ఈఈలు నళిని, తిరుమలేష్, డీఈ సాయి, ఎంపీడీఓ కె.విజయభాస్కర్, అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి తదితరలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతి ఔన్నత్యాన్ని పరిరక్షించుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలం: భవిష్యత్ పౌరులైన విద్యార్థులు ఆదివాసీ జాతి ఔన్నత్యాన్ని పరిరక్షించుకునేలా బాధ్యతగా వ్యవహరించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గిరిజన సంక్షేమ ఆశ్రమ, వసతి గృహాలు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు భద్రాచలంలోని గిరిజన భవన్‌లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఓ ఆదివాసీ దినోత్సవ ప్రత్యేకతలు, సంస్కృతిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, వివిధ శాఖల అధికారులు రమణయ్య, భద్రయ్య, బుచ్చిరాములు, నాగమణి, సరోజిని, సుభద్ర, కృష్ణయ్య, రాధ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించండి



ఆళ్లపల్లిలో మొక్క నాటుతున్న డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, తదితరులు

గుండాల: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనే కాక రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటడంతో సంరక్షించడాన్ని అన్ని శాఖల ఉద్యోగులు బాధ్యతగా స్వీకరించాలని డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఆళ్లపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌తో మాట్లాడుతూ మొక్కలు నాటితేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి రేవంత్‌ను సూచించారు. అలాగే, మురుగునీటి తొలగింపు, నిల్వ నీటిలో గంబూషియా చేపలు వదలడం, ఆయిల్ బాల్స్ వేయడంపై సమీక్షించారు. ఆతర్వాత అనంతోగు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించి మొక్కలు నాటారు. కాగా, గుండాలలో ఎంపీడీఓ సత్యనారాయణ ఆధ్వర్యాన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'గానకోకిల' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంగాంధీచౌక్: సామాజిక సమస్యలపై పాటల ద్వారా ప్రజల్లో తీసుకొస్తున్న అవగాహన గాయకులకు 'గానకోకిల' పురస్కారాలు అందించనున్నట్లు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ కన్వీనర్ కోమాకుల సీతారాములు, కోకన్వీనర్లు కొమిరె సాకీ, నిర్మల తెలిపారు. పాటల ద్వారా సమాజాన్ని ప్రభావితం చేసిన వారు, సామాజిక సమస్యలపై పాడిన గాయనీ, గాయకులు పూర్తి వివరాలను 83747 93374, 99088 04755 నంబర్లకు వాట్సాప్ ద్వారా ఈనెల 12వ తేదీలోగా పంపించాలని సూచించారు. ఎంపిక చేసిన వారికి ఈనెల 18న సత్కారం, అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వైద్యులు

భద్రాచలంఅర్బన్: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగి న బదిలీల్లో భద్రాచలం ఏరియాస్పత్రికి పలువురు వైద్యులను కేటాయించారు. అలాగే, కాంట్రాక్టు విధానంలో కూడా పలువురు నియమితులయ్యారు. కాగా, విధుల్లో చేరిన వారిలో కంటి విభాగానికి సంబంధించి డాక్టర్ హిమబిందు రెగ్యులర్ వైద్యురాలు కాగా.. ఇదే విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిపై సింగరేణి రిటైర్డ్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేరారు. ఇంకా డ్యూటీ డాక్టర్లుగా శర్వాణి, శ్రీభవ్య, గైనకాలజీ విభాగంలో కాంట్రాక్టు వైద్యురాలిగా ప్రమీలరాణి విధుల్లో చేరారు. అంతేకాక ఇటీవల బదిలీల్లో భద్రాచలం ఏరియా ఆస్పత్రి నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన అనస్తీషియన్ దేవరాజ్, డెంటిస్ట్ యుగంధర్, పీడియాట్రీషియన్ క్రాపా విజయ్‌తో పాటు అశ్వారావుపేట నుంచి డాక్టర్ సాయికిరణ్, కొత్తగూడెం నుంచి డాక్టర్ రమ్యను డిప్యూటేషన్‌పై భద్రాచలానికే కేటాయించారు. అయితే, చర్మ వ్యాధులు, ఈఎన్‌టీ, రేడియాలజీ విభాగాల్లో రెగ్యులర్ వైద్యులు లేకపోగా కాంట్రాక్ట్ వైద్యులు కూడా ముందుకు రాలేదు. త్వరలోనే రేడియాలజీ విభాగానికి సంబంధించి ఒక వైద్యురాలు చేరే అవకాశముందని తెలిసింది.

మొక్కల ధ్వంసంపై కేసు

దమ్మపేట: ఆయిల్‌పామ్ క్షేత్రంలోకి ప్రవేశించి మొక్కలు ధ్వంసం చేసిన వారిపై గురువారం కేసు నమోదైంది. దమ్మపేటలోని అర్బన్ కాలనీకు చెందిన కొమరం లక్ష్మి మందలపల్లిలో ఆయిల్‌పామ్ సాగు చేస్తోంది. మందలపల్లికి చెందిన గడ్డం బాలస్వామి, మరో ఇద్దరు తోటలోకి మంగళవారం ప్రవేశించి లక్ష్మిని బెదిరించడమే కాక మొక్కలను ధ్వంసం చేశారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

కార్యమేదైనా.. డోలు మోతే!

- ఆదివాసీల సంస్కృతితో విడదీయలేని బంధం
- బాజాభజంత్రీలకు ఆది నుంచి దూరమే..
- చప్పుడు ఉంటేనే ఊపు, ఉత్సాహం



ర్యాలీలో డోలు కొడుతున్న ఆదివాసీలు (ఫైల్)

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

గుండాల: ఆదివాసీ పల్లెల్లో డోలు మోగిందంటే ఐదు కి.మీ. దూరం వరకు వినిపిస్తుంది. అది విన్న గిరిజనులు అక్కడ చావో, పండగో జరుగుతుందని భావిస్తారు. ఆదివాసీలు తరతరాలుగా మంచి, చెడు ఏ కార్యక్రమమైనా డోలు వాయించడం ఆచారంగా కొనసాగిస్తున్నారు. ప్రతీ గిరిజన గ్రామంలో వనదేవతలు, విత్తన పండగలు, కొత్తపోడి(పంటకోతలు), గ్రామదేవతలతో పాటు ఇతర జాతర్లలో డోలుదే ప్రధాన భూమిక. గిరిజనులు మరణిస్తే కర్మలకు తప్పకుండా రెండు రోజుల పాటు డోలు మోగాల్సిందే. ఇటీవల పార్టీల ర్యాలీలు, విజయోత్సవ ర్యాలీలు, హోలీ సంబరాలకు సైతం డోలు వాయిచేందుకు ఆదివాసీ గిరిజనులను ప్రత్యేకంగా పిలిపిస్తున్నారు.

తయారీ ఇలా...

అడవుల్లో లభించే అందుగు మొద్దులను సేకరిస్తారు. వీటి తొడుగు(చెక్కను), లోపల గుజ్జు పూర్తి తొలగిస్తారు. ఏ సైజులో కావాలంటే ఆ సైజ్‌లో కోసి రెండు వైపులా జంతు చర్మాలతో మూసివేస్తారు. ఆపై ఎక్కువ చప్పుడు వచ్చేలా తాళ్లను గట్టిగా లాగి కడతారు. దీంతో డోలు సిద్ధమవుతుంది.

చిన్నాపెద్ద తేడా లేదు..

ఖరీఫ్ సీజన్ ఆరంభంలో విత్తనపు పండుగకే కాక పంట చేతికొచ్చాక ఆదివాసీల కొత్తపోడి పండుగ జరుపుకుంటారు. ఆతర్వాత పెళ్లిళ్ల జోరందుకుంటుంది. వీటి మధ్య వచ్చే జాతరలు, విగ్రహ ప్రతిష్ఠాపనలకే కాక కర్మలకు డోలు మోగుతుంది. ఈ చప్పుళ్లతో గిరిజనుల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా దరువేస్తారు. ముఖ్యంగా జాతరలు, ఇతర పండుగ సందర్భాల్లో డోలు చప్పుడు వింటే ఎంతటివారైనా చిందేయాల్సిందే. పెళ్లిళ్ల సందర్భాన భాజా, భజంత్రీలను కేవలం తాళి కట్టేంత వరకు ఉపయోగిస్తారు. ఆదివాసీ గిరిజనులు తాతముత్తాల కాలం నుంచి ఇదే సంప్రదాయాన్ని పాటిస్తుండగా.. డోలు లేకుండా ఏ చిన్న కార్యక్రమమైనా జరగదనే చెప్పాలి.

చిన్నప్పుడే నేర్చుకున్నా



చిన్నతనంలోనే మా తాత, నాన్న వాళ్లు డోలు కొట్టేందుకు పోతుంటే వాళ్లతో వెళ్లేవాడిని. అలా వాళ్లు కొడుతుంటే చూసి నేర్చుకున్నా. దానంతట అదే అలవాటైంది. ఎక్కడ ఏ కార్యక్రమం అయినా వెళ్తుంటా. ముందురోజు కబురుచేస్తే అన్నీ సిద్ధం చేసుకుంటాం.

– కత్తుల నాగేశ్వరావు, సాయనపల్లి

ఒకే రోజులో వచ్చేసింది



మా పక్క ఊళ్లో కర్మలు ఉండగా మా నాన్న వాళ్లు వెళ్తే నేనూ వెళ్లేవాడిని. మా నాన్న డోలు కొడుతుంటే చూశా. ఎలా కొడుతున్నారో మంచిగా గమనించే వాడిని. ఆతర్వాత నేను కూడా కొంచెం మొదలుపెట్టగానే వచ్చేసింది. ఇప్పుడు అవలీలగా పాట పాడుతూ డోలు వాయిస్తా.

– కత్తుల శివ శంకర్, సాయనపల్లి

పండుగ చేసుకుందాం!

విత్తు నాటినా, పంట చేతికొచ్చినా ఆదివాసీ పల్లెల్లో సంబురమే

హిందూ సంప్రదాయ పద్ధతిలో ఏటా వచ్చే పండుగల మాదిరిగానే ఆదివాసీ గ్రామాల్లోనూ ప్రత్యేక పండుగలు జరుపుకుంటారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి జరిపే పండుగలకు ప్రత్యేకత ఉంటుంది. విత్తు నాటింది మొదలు.. పంట చేతికొచ్చే వరకు విత్తనాల పండుగ, సాలు దేవార, కొత్తపొడి ఇలా మూడు రకాల పండుగలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పండుగలతో ఖరీఫ్ వచ్చిందంటే చాలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో సందడి నెలకొంటుంది.

■ విత్తనాల పండుగ

అటవీ ఉత్పత్తులు, తునికాకు సేకరణ అయిపోతుండగానే ఖరీఫ్ వస్తుంది. ముందుగా వేసవి దుక్కులు చేసుకుని వర్షాలు పడుతుండగానే విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతారు. దీనికి ముందు గిరిజనులంతా ముత్యాలమ్మ, బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. తమ సంప్రదాయం ప్రకారం విత్తనాలను కుల, వన, గ్రామ దేవతల వద్ద ఉంచి కోళ్లు, మేక, పంది ఇలా ఒక్కొక్కరు ఒక్కో రీతిలో బలి ఇస్తారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని వేడుకుంటారు.

■ సాలు దేవర

విత్తనాలు భూమిలో వేశాక సాలు దేవర పండుగ నిర్వహిస్తారు. ఏదో ఒక జంతువును బలిచ్చి ఆ నైవేద్యం పంటలపై చల్లుతారు. పంటలు ఏపుగా పెరగాలని, పూత, కాపు మంచిగా రావాలని, మంచి దిగుబడులు రావాలని సాలు దేవరను వేడుకుంటారు. సాగు చేసే పంట చేన్ల వద్దే ఈ పండుగ గ్రామస్తులంతా కలిపి జరుపుకుంటారు.



విత్తనాల పండుగలో భాగంగా బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఫైల్)

■ కొత్తపొడి

పంట మొదటి దశ చేతికి రాగానే మూడో పండుగగా కొత్తపొడి నిర్వహిస్తారు. ఈ పండుగ చేశాకే ఆ పంటను తినడం ప్రారంభిస్తారు. కొత్తపొడి చేయనిదే ఆదివాసీలు పంటను కోయడం, తినడం కానీ చేయరు. మొక్కజొన్న, పెసర, ఇతర పంటలు దసరా నాటికి చేతికొస్తాయి. గిరిజనులు పంటతో నైవేద్యం వండి దేవతలకు పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. అయితే గ్రామంలో ఏ రైతు పంట ముందుగా చేతికొస్తే ఆ రైతు తమ కుటుంబంలో పండుగ జరుపుకుంటారు. ఈ పండుగలు నిర్వహించే క్రమాన గ్రామ గిరిజనులంతా కలిసి డోలు చప్పుళ్ల నడుమ నృత్యాలు చేసుకుంటూ ఆదివాసీ దేవతలను వేడుకుంటారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ పండుగలు చేయ డం మర్చిపోరు. ఇవేకాక ఇతర పండుగలనూ ఆదివాసీలు జరుపుకుంటారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

సూపర్‌బజార్(కొత్తగూడెం): వర్షాలతో పంట నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవడమే కాక షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. కొత్తగూడెం క్లబ్‌లో గురువారం నిర్వహించిన పార్టీ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి వరదలతో పరివాహక ప్రాంత ప్రజలు సర్వస్వం కోల్పోయినందున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. అంతేకాక భద్రాచలంలో వరదకు శాశ్వత పరిష్కారంగా కరకట్ట నిర్మాణం చేపట్టాలని కోరారు. నిబంధనల పేరుతో కొందరు రైతులకు రుణమాఫీ జరగలేదని.. ఇకనైనా వారి విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కాగా, బొగ్గుబ్లాక్‌ల వేలానికి నిరసనగా అన్ని పార్టీలను కలుపుకుని పోరాటం చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, సీతారామ ప్రాజెక్టు ద్వారా మొదట డిజైన్ చేసినట్లుగా సాగునీరు ఇవ్వాలని తమ్మినేని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు పోతినేని సుదర్శన్, కాసాని అయిలయ్య, యలమంచిలి రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, ఏ.జే.రమేష్, ఎం.బీ.నర్సారెడ్డి, ఎం.జ్యోతి, కె.బ్రహ్మాచారి, కె.పుల్లయ్య, బాలరాజు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయదారుల బైండోవర్

చర్ల/టేకులపల్లి: చర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న ఏడుగురిని ఎక్సైజ్ అధికారులు గురువారం చర్ల తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా తెలిపిన వివరాల ప్రకారం.. నాటుసారా విక్రయదారులను బైండోవర్ చేయగా.. మళ్లీ వారు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీతారామరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని కొత్తపల్లిలో నాటుసారా విక్రయిస్తున్న ఓ మహిళ నుంచి 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ రహీమున్నీసా తెలిపారు. ఇక టేకులపల్లి మండలం కోక్యాతండాలో నాటుసారా అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్‌ఐ పోగుల సురేష్, సిబ్బంది గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గుగులోత్ లచ్చ ఇంట్లో ఐదు లీటర్ల సారా లభించగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'స్వచ్ఛదనం – పచ్చదనం' అందరి బాధ్యత

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



మహిళలకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

బూర్గంపాడు/అశ్వాపురం: పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో ప్రతీఒక్కరు సామాజిక బాధ్యతగా పాల్గొనాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. బూర్గంపాడు, అశ్వాపురం మండల కేంద్రాల్లో గురువారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బూర్గంపాడు అంబేడ్కర్‌కాలనీలో మహిళలతో సమావేశమైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాక మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. తద్వారా కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. అలాగే, అశ్వాపురంలో తహసీల్, మండల పరిష త్ కార్యాలయాలను సందర్శించి మురికినీటి గుంటల్లో గంబూషియా చేపలు, ఆయిల్ బాల్స్ వేశారు. ఆపై క్రీడా ప్రాంగణంలో మొక్కలు నాటడమే కాక తహసీల్ ఆవరణలోని గుంటలు పూడ్చివేయించాలని సూచించారు. తహసీల్దార్ ముజాహిద్, మండల ప్రత్యేక అధికారి జి.వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓలు జమలారెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, డాక్టర్ సంకీర్త, వివిధ శాఖల ఉద్యోగులు సునీల్, రషీద్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గోలో మత్తుపదార్థాలు

స్వాధీనం చేసుకున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న గుట్కాలు, వ్యాపారితో పోలీసులు

ఇల్లెందు: ఆర్టీసీ కార్గో ద్వారా మత్తు పదార్థాలు రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇల్లెందులో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇల్లెందుకు చెందిన వ్యాపారి ఎ.నాగేశ్వరరావు కరీంనగర్ నుంచి ఆర్టీసీ కార్గోలో పార్సిళ్లు తెప్పించారు. వీటిని లలిత కళామందిర్ రోడ్డులోని ఇంటికి చేర్చే క్రమాన పోలీసులు తనిఖీ చేయగా రూ.35వేల విలువైన పొగాకు, గోల్డెన్ జర్దా, కాశ్మీరీ కిమామ్, ఆర్ఎండీ, అంబర్ తదితర గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. దీంతో వ్యాపారిపై కేసు నమోదు చేసి సరుకు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

మందలపల్లిలో...

దమ్మపేట: నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మందలపల్లిలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దారా శ్రీనివాసరావు పాన్‌షాపు నుంచి రూ.10,800 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన వారి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్, అధికారులు

కొత్తగూడెంటౌన్: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈమేరకు వివరాలను కొత్తగూడెంలో గురువారం ఎస్పీ రోహిత్‌రాజ్ వెల్లడించారు. భద్రాద్రి జిల్లా పోలీసులు, 141, 81 బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట మావోయిస్టులు లొంగిపోగా.. వీరిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గొల్లపల్లి ఎల్ఓఎస్ సభ్యుడు మల్లం దేవా, తెలంగాణలోని శబరి ఏరియా కమిటీ సభ్యుడు వెట్టి లక్ష్మయ్య అలియాస్ కల్లు ఉన్నారని తెలిపారు. ఇందులో దేవా 2021లో శబరి ఏరియా మిలీషియా కమాండర్ వద్ద సభ్యుడిగా చేరగా, మావోయిస్టులకు అవసరమైన నిత్యావసర వస్తువులు సరఫరా చేసేవాడని పేర్కొన్నారు. 2022లో దళ సభ్యుడిగా నియమించడంతో కొద్దిరోజులు ఆజాద్(బీకే-ఏఎస్ఆర్-డీవీసీఎం)కు గార్డుగా.. ఆతర్వాత శబరి ఏరియాకు కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడని తెలిపారు. అలాగే, మల్లం దేవ 2007 నుండి 2015 మావోయిస్టు బాలల సంఘంలో పని చేయగా, 2015లో గొల్లపల్లి ఎల్ఓఎస్ మిలీషియా కమాండర్ మడకం ఉంగల్ అలియాస్ ఎర్రాల్ వద్ద సభ్యుడిగా చేరాడని చెప్పారు. ఆపై 2017లో మిలీషియా సభ్యుడిగా, 2020లో దళ సభ్యుడిగా నియామకమైన దేవా గొల్లపల్లి ఎల్ఓఎస్ కమాండర్ ఎర్రా దాదా మరణానంతరం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. కాగా, ఆపరేషన్ చేయూత కౌన్సెలింగ్‌కు హాజరైన పలువురు మావోల్లో తమ కుటుంబీకులను బయటకు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని ఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో ఓఎస్డీ పరితోష్ పంకజ్, సీఐ ఏ.రాజువర్మ, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతూ పట్టుబడిన పాల్వంచ వాసి

పాల్వంచ: గంజాయి సరఫరా చేస్తున్న ఓ యువకుడు హైదరాబాద్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. పాల్వంచకు చెందిన నరేందర్ గంజాయిని సరఫరా చేస్తుండటంతో అక్కడి ఎక్సైజ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఆయన ఏపీ నుంచి హైదరాబాద్‌లోని పలు హుక్కా కేంద్రానికి గంజాయి సరఫరా చేసినట్లుగా గుర్తించారు. ఈమేరకు నిందితుడు ఇచ్చిన సమాచారంతో మచ్చబొల్లారంలో 2.2 కేజీల పొడి గంజాయి, ఆర్కేపురంలో 1.8కేజీలు, శేరిలింగంపల్లి ఆదర్శ నగర్‌లో 830 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ప్రేమ పెళ్లి.. ఆపై కులం పేరుతో వేధింపులు

ఇల్లెందు: ప్రేమించి పెళ్లి చేసుకున్న వ్యక్తి ఇటీవల కులం పేరుతో దూషిస్తుండడంతో బాధితురాల పోలీసులను ఆశ్రయించింది. ఇల్లెందు సత్యనారాయణపురానికి చెందిన చీమల లావణ్యను మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడకు చెందిన మేడి రేఖమయ్య ప్రేమించి 2017లో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు జన్మించగా కొంతకాలంగా ఇరువురి మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గిరిజనురాలైన లావణ్యను ఆమె భర్త కులం పేరుతో దూషిస్తుండటంతో పోలీసులను ఆశ్రయించగా గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భూక్యా సూర్యా తెలిపారు.

'సీతారామ' కాల్వలో పడి వ్యక్తి మృతి

- గొర్రెపోతును కాపాడే క్రమంలో ప్రమాదం
- న్యాయం చేయాలంటూ గ్రామస్తుల ఆందోళన



రాములు (ఫైల్)

ములకలపల్లి: మండలంలోని పూసుగూడెం శివారు సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్-2 సమీపాన కాల్వలో ప్రమాదవశాత్తు పడిన పశువుల కాపరి మృతి చెందాడు. ఒడ్డురామవరం గ్రామానికి చెందిన భూక్యా రాములు(60) భార్య గంసీతో కలిసి గురువారం పూసుగూడెం శివారు సీతారామ కాల్వ వద్ద గొర్రెలను మేపుతున్నాడు. ఈక్రమంలో ఒక గొర్రె పోతు కాల్వలో పడగా.. ట్రయల్‌రన్ నేపథ్యాన కాల్వలో భారీగా నీళ్లు చేరాయి. అయినప్పటికీ గొర్రె పోతును రక్షించాలనే తాపత్రయంలో రాములు కాల్వలోకి దిగాడు. అప్పటికే పోతు మృతి చెందగా ఆయన కాల్వకు అమర్చిన ప్లాస్టిక్‌పైపులకు పట్టుకొని గొర్రెపోతుతో సహా ఎక్కుతుండగా పట్టు కోల్పోయి మళ్లీ కాల్వలో పడ్డాడు. దీంతో ఆయన భార్య గంసీ కేకలు వేయగా స్థానికులు చేరుకుని బయటకు తీసేసరికి రాములు మృతి చెందాడు.

గ్రామస్తుల ఆందోళన

రాములు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబీకులు, గ్రామస్తులు పంప్‌హౌస్-2 వద్ద ఆందోళన చేపట్టారు. రాములు మృతదేహంతో నిరసన తెలిపిన వారు మాట్లాడుతూ కాల్వ చుట్టూ ఫెన్సింగ్ వేయకపోవడం, కాల్వ గట్టుపై రివిట్‌మెంట్ చేయకపోవడమే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. ఈ మేరకు ఎస్సై రాజశేఖర్, తహసీల్దార్ జి.పుల్లారావు, ఆర్ఐలు శాంతాదేవి, భద్రు, ఎంపీఓ లక్ష్మయ్య, పీఆర్ ఏఈ సురేశ్ చేరుకోగా ఐదు గంటల పాటు చర్చలు జరిగాయి. శుక్రవారం ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చలకు పిలుస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నూనావత్ రమేశ్, భూక్యా ధర్మ, బానోతు అమర్‌సింగ్, గుగులోతు శంకర్, తాండ్ర ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

విషపురుగు కుట్టడంతో వ్యక్తి..



రవి (ఫైల్)

గుండాల: పొలం పనుల్లో నిమగ్నమైన వ్యక్తిని విషపురుగు కుట్టడంతో మృతి చెందిన ఘటన ఇది. గుండాల మండలం కొనవారిగూడెంకు చెందిన సనప రవి(40) బుధవారం ట్రాక్టర్‌తో పొలం దమ్ము చేయడానికి వెళ్లాడు. అక్కడ కాలికి ఏదో కుట్టినట్లు అనిపించినా ఏమిటో గుర్తించలేకపోయాడు. రాత్రి ఇంటికి వచ్చి నిద్రించిన ఆయన అస్వస్థతకు గురికావడంతో 108లో గుండాల ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. ఈమేరకు పరిస్థితి విషమించడంతో ఆయన గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. రవికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండలంలోని మల్కారం శివారు శ్మశాన వాటిక సమీపాన పేకాట ఆడుతున్న 12మందిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై సాయికిషోర్‌రెడ్డి, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 12 మందిని అదుపులోకి తీసుకుని, రూ.6,150 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

ముదిగొండ: ప్రమాదవశాత్తు ఓ యువకుడు బావిలో పడి మృతి చెందాడు. మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన మామిడి సాయి(21) తమ పొలంలో వరినారు కట్టలు వేయడానికి వెళ్లి పనులు ముగిశాక వాగులో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లాడు. ఆ సమయాన ప్రమాదవశాత్తు వాగులో లోతుగా తీసిన బావిలో కాలు జారి పడగా ఆయనకు ఈత రాకపోవడంతో మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ నరేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

జ్వరంతో మహిళ...

అశ్వాపురం: మండలంలోని బట్టీలగుంపుకి చెందిన తాటి రజిత(32) జ్వరంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. కొంత కాలంగా జ్వరంతో బాధపడుతున్న ఆమెకు భద్రాచలంలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఆపై కాలేయం, మూత్రపిండాలు దెబ్బతి ఆరోగ్యం క్షీణించగా హైదరాబాద్ తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు ఢీకొని 15 మేకలు...

అశ్వాపురం: కొమ్ముగూడెం రైల్వేగేట్ వద్ద బుధవారం రాత్రి రైలు ఢీకొనడంతో 15 మేకలు మృతి చెందాయి. మండల కేంద్రంలోని తురుగులగూడెం తండాకు చెందిన ధరావత్ సుక్యా, బాణోత్ తులసియా, బాణోత్ అటియా, ధరావత్ వీరన్న, బానోత్ అర్జున్‌కు చెందిన 27 మేకలు రైల్వేస్టేషన్ సమీపాన మేతకు వెళ్లాయి. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా వర్షం రావడంతో మేకలు గేటు దాటే క్రమాన వచ్చిన రైలు ఢీకొట్టడంతో 15 జీవాలు మృతి చెందాయి. మిగతావి కూడా గాయపడిన నేపథ్యాన తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.